# అత్తగారు-నైటు గౌను

-డి.నాగమణి

శాంతమ్మగారికి, తనకు నచ్చని ఏ చిన్నపనైనా ఎవరైనా చేసారంటే హై బీపీతో ఆసుపత్రి పాలు కావడం మామూలైపోయింది. నాకెందుకులే అని సరిపెట్టుకునే మనస్తత్వం కాదావిడది. ఆవిడకు ముగ్గురు కొడుకులు. అందరికి పెళ్ళిళ్ళయ్యాయి. కూతురు కూడా అల్లుడితో పాటు హాయిగా కాపురం చేసుకుంటోంది. కొడుకులు కోడళ్ళు అందరూ ఉన్నత ఉద్యోగాల్లో వున్నారు. ఇద్దరు కొడుకులు, కోడళ్ళు అమెరికాలో డాక్టర్లుగా స్థిరపడి అక్కడే వుంటున్నారు. పెద్దకొడుకు, కోడలు ఇక్కడే లెక్చరర్స్‌గా చేస్తూ, ఇంటి పట్టునే ఉన్నారు.

★ ★ ★

పెద్దకోడలు కాన్వెంటులో చదువుకుంది. ఆధునిక వాతావరణంలో పెరిగినా, పెళ్ళయ్యాక, అత్తవారింట్లో, ఆధునికతను పక్కకు పెట్టి సంప్రదాయబద్ధంగా నడుచుకునేది. అప్పుడప్పుడు ఆడపడుచు తల్లి గారింటికి వచ్చి, మాక్సీలు, చుడీదార్‌లు వేసుకుని, ఇల్లంతా తిరగాడేది. పైగా తన అత్తవారింట్లో స్వేచ్ఛ లేదని, ఏ డ్రెస్ వేసుకున్నా ఓర్వలేదని, అత్తపై చాడీలు చెబితే, శాంతమ్మగారు కూతుర్ని ఓదార్చేది. పై సంభాషణలన్నీ పెద్ద కోడలు విని, తన అత్తగారు 'శాంతమ్మే' ఇలా ఓదారుస్తుందా? అని విస్తుపోయేది. కాని అత్తగారిని కాదని తాను మాత్రం నైటు గౌనులు వేసుకునేందుకు జంకేది. పెద్ద కొడుకు తల్లి మాట జవదాటడు. భార్య మాట కాదనలేడు. నైటీ వేసుకుని ఇల్లంతా తిరగలేక పోతున్నాననే పెద్ద కోడలు సరిత కోరిక మాత్రం- తీరకుండా మిగిలిపోయింది.

★ ★ ★

ఈలోగా అమెరికా నుంచి తమ తోడికోడళ్ళిద్దరు, మరుదులు పిల్లలతో కలిసి ఇక్కడి కొస్తున్నారన్న వార్తొచ్చింది. శాంతమ్మగారి ఆనందానికి అవధులు లేవు. ఇల్లంతా హడావిడిగా తిరుగుతూ, చుట్టుపక్కల వాళ్ళకి, బంధువులకు, తమ కొడుకులు, కోడళ్ళు పిల్లలతో సహా వస్తున్నారని చెప్పి మురిసిపోయింది. తన కూతురుకు ఈ సమాచారం తెలిపి ఆవిడను ముందే వచ్చి పిల్లలకు స్వాగతం చెప్పే పనిలో నిమగ్నం చేసింది. తన ఆడబిడ్డ పిల్లలను అపురూపంగా చూసుకునేది. కాని తన పిల్లలను చూడండి అత్తయ్య అంటే, వొంట్లో బాగోలేదని, తప్పించుకునేది. పిల్లలు గట్టిగా మాట్లాడితే 'కాకిగోల' అని విసుక్కునేది. చివరకు తన వేష భాషలు కూడా ఎలా వుండాలో ఆవిడే నిర్ణయించడం తనకేమాత్రం ఇష్టం కావడం లేదు. ఎందుకు వివక్షత అన్నదానికి సమాధానం లేదు.

అనుకున్నట్లుగానే శాంతమ్మ కొడుకులు, కోడళ్ళిద్దరూ, పిల్లలు రానే వచ్చారు. ఇల్లంతా పెద్ద సందడి. అమెరికా అంటే శాంతమ్మగారికి అదోరకమైన అభిమానం. అక్కడి కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు అర్థం కాకున్నా, వారేం చేసినా గొప్పే అనే మనస్తత్వం ఆవిడది. బెడ్‌రూముల్లోంచి కోడళ్ళు బయటకు రాకున్నా, తానే వెళ్ళి వాళ్ళకు కాఫీలు, టిఫిన్‌లు అందించి తరించిపోయినట్లుగా సంబరపడిపోయింది. పెద్దకోడలు సరిత మౌనంగా యివన్నీ చూస్తూ ఆశ్చర్యపోసాగింది. తన తోడి కోడళ్ళు యిద్దరూ, యిల్లంతా నైటీలు వేసుకుని తిరుగాడుతుంటే ఏమనని అత్తగారు తననెందుకు ఆడిపోసుకుంటుందో అర్థం కాక, సతమత మవుతోంది సరిత. తానెప్పుడూ అమెరికా వెళ్లాలనేలా ఆపేక్షపడుతూ, వాళ్ళకు సేవలు చేస్తుంది అత్తగారు! చివరకు, కొడుకులు, కోడళ్ళు ముక్తకంఠంతో అత్తయ్యను అమెరికా తీసుకెళ్దామన్న ప్రతిపాదనను ఆవిడ కాదనలేకపోయింది. అత్తగారు అమెరికా వెళ్తున్నందుకు, సరిత ఎంతో సంతోషించింది. అత్తగారులేని సమయంలో తన తీరని కోరికలను, నెరవేర్చుకోవచ్చని ఉబలాట పడింది.



★ ★ ★

శాంతమ్మగారు అమెరికా వెళ్ళాక సరిత తన అమ్మను పిలిపించుకుంది. రోజుకో అధునాతన డ్రెస వేసుకుంటోంది. ముఖ్యంగా తన ఫేవరెట్ నైటీలను అపురూపంగా ధరిస్తోంది. అత్తలేని ఇల్లు ప్రశాంతంగా వుందనిపిస్తోంది ఆవిడకు. తనను చీటికి మాటికి సాధించే వారు లేరు. కొన్ని రోజులయ్యాక అత్తలేని లోటును 'ఫీల్' కాసాగింది. తాను కోరుకున్న డ్రెస్‌లో ఫోటోలు కూడా దిగి, వాటిని ఆల్బమ్స్‌లో పదిల



పరుచుకుంది. ఎదురింటి అమ్మాయి, ''రోజు ఉదయం, సాయంత్రాలు నైటీలు వేసుకుంటున్నారు. మీ అత్తగారు వచ్చాక ఎలా'' అని ప్రశ్నించేసరికి, ఆలోచనలో పడిపోయింది సరిత. ఆరునెలల నుంచి వేసుకుంటున్న అలవాటును మానాలనుకోవడం అంత సులువు కాదు. అత్తగారు అమెరికా వెళ్ళాక ఈ పట్టింపులు వుండకపోవని పూర్తిగా మారిపోయిందని సరిత నమ్మకం. తన తోటి కోడళ్ళు వేసుకుంటే వద్దనని అత్తగారు, తాను వేసుకుంటే, ఇంత మొండిపట్టు ఎందుకా అని ఆశ్చర్యపోయింది. ఈ విషయం తన అమ్మకు చెప్పినా, అత్తయ్యనే వెనకేసుకొస్తుందే కాని, తనను సమర్ధించదు. అత్తయ్యల ఆధిపత్యానికి, అడ్డుకట్ట వేయడం ఎలా అన్నదే ఆవిడను పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్య.

అత్తగారు తిరిగి స్వదేశం రానే వచ్చారు. ఇంట్లోకి అడుగు పెట్టగానే నైటీలో దర్శనమిచ్చిన పెద్దకోడలు సరితను చూసి దిగ్భ్రాంతి చెందారు శాంతమ్మ. కాని రాగానే కోడలును ఆడిపోసుకుంటే, బాగుండదని మౌనంగా వుండిపోయింది ఆవిడ. వారం రోజులైనా సరితలో మార్పు రాకపోయేసరికి ఆవిడ ఆందోళన అధికమైంది. తన పెద్ద కొడుకు రవిని పిలిపించుకొని, కోడలు నిర్వాకాన్ని ఎండగట్టింది. కాని ముందు అనుకున్న అగ్రిమెంట్ ప్రకారం భార్య నైటీలు వేసుకున్నా తాను కలుగచేసుకోనన్న 'హామీ'ని దృష్టిలో వుంచుకొని సరిత భర్త ఏం చేయలేకపోయాడు. శాంతమ్మ తన భర్తను పిలిచి కూడా ఈ సమస్యను చెప్పుకుంటే, ''నీకెందుకివన్నీ, ఈకాలం పిల్లలు వేరు. అనవసరంగా వాళ్ళ విషయాల్లో కలిపించుకొని, చులకన కావద్దు'' అన్న మాటలు శాంతమ్మకు రుచించలేదు.

★ ★ ★

తనముందే కోడలు నైట్‌గౌను వేసుకొని తిరగడం తనను అవమాన పరచడమేనని భావించారు అత్తగారు. ఇంట్లో కలివిడిగా తిరుగాడుతున్న సరితను పిలిచి ఓరోజు పైకే అనేసారావిడ. దానికి ''నైట్ గౌను వేసుకోవాలా వద్దా అన్నది నా వ్యక్తిగత నిర్ణయం, నా







హద్దులో నేనున్నంతవరకు, మీరు కలిపించుకోవద్దన్న'' కోడలు మాట విని కుప్పకూలిపోయింది శాంతమ్మ. బి.పి ఎక్కువయ్యేసరికి ఆవిడను నర్సింగ్‌హోమ్‌లో చేర్పించడం తప్పిందికాదు. ఆసుపత్రిలో వుంటూ కూడా, తన కోడలు నైటీలు వేసుకొంటుందా లేదా అనే ధ్యాసే తప్ప మరేం లేదు ఆవిడకు. డాక్టర్లకు శాంతమ్మగారు ఎందుకు హైరానా పడిపోతున్నదో, అంతుబట్టడం లేదు. ఈ విషయం తెలుసుకొని, శాంతమ్మ భర్త ఓ నిర్ణయానికి వచ్చారు. అత్తా, కోడళ్ళు ఒక యింట్లో వుండే పరిస్థితి లేదని ఆయన గ్రహించారు. తన పెద్ద కొడుకు రవిని పిలిచి, వేరే యిల్లు చూసుకొని కాపురం పెట్టమని మృదువుగా సలహా యిచ్చారు. పది సంవత్సరాలుగా తల్లిదండ్రుల వద్ద వుండటం వల్ల వాళ్ళు తన కుటుంబానికి చేదోడు వాదోడుగా వుండేవారు. ఎంత సాధించినా, తన తల్లి తమ బాగోగుల్ని, పట్టించుకునేది. ఎవరెన్ని మాట లన్నా ధైర్యం చెప్పేది. ఈ విషయాలన్నీ సరితకు చెప్పాడు రవి. అయినా తాను నైటీలు విడిచే ప్రసక్తే లేదని ఖచ్చితంగా చెప్పి వేరే కాపురం పెట్టింది సరిత.

★ ★ ★

తన కోడలు ఇల్లు వదిలేసిందని, ఇక యింట్లో నైటీలో తిరిగే ప్రసక్తే వుండదని భర్త చెప్పేసరికి, ఆసుపత్రి నుంచి డిశ్చార్చి అయ్యి ఇంటికొచ్చారు శాంతమ్మగారు. మనుమడు, మనుమరాలు, కోడలు, కొడుకులతో సందడిగా వుండే యిల్లు బోసిపోయినట్లు అనిపించింది. ఒక్క నైటీ విషయంలో తప్ప, మిగతా విషయాల్లో ఎన్నడూ తనకు ఎదురు తిరగని కోడలిపై జాలి కలిగినా తన పట్టు వదల్లేదు శాంతమ్మ. ఇంట్లో అందరిముందు, కోడలు నైటీలతో తిరగడం ఆవిడకు సుతారామూ యిష్టం లేదు. ఒక వూళ్ళో వుంటూ, కొడుకు కోడలును చూడకుండా వుండడం శాంతమ్మకు సాధ్యపడలేదు. తన భర్తను పంపి వాళ్ళ యోగక్షేమాలు తెలుసుకుంటూనే వుంటుంది. అప్పుడప్పుడు రవి అమ్మా నాన్నలను కలిసి పోతున్నాడు. కోడలు నైటీ వేసుకుంటుందా అని అడగాలనుకున్నా అభిమానం అడ్డొచ్చి అడగలేకపోయేది శాంతమ్మ. దగ్గరి బంధువులు, యిరుగు పొరుగు వచ్చినప్పుడు కూడా ఏదో విషయాన, తన కోడలు ఇంట్లో చీరల్తో వుంటుందా, నైటీలు వేసుకుంటుందా అని ఆరాలు తీస్తే, ఆవిడ చాదస్తం చూసి లోకులు ముక్కున వేలేసుకున్నా, ఇవేం పట్టించుకునేది కాదు శాంతమ్మ.

అత్తయ్య తమ కుటుంబం గురించి పడే ఆరాటం సరితకు తెలిసింది. ఈ వయస్సులో అత్తగారు తన 'నైటీ' విషయంలో ఆందోళన పడ్డం, బాధింపచేసింది సరితను. అత్తగారు పాత తరం వారు. కోడలు నిండుగా చీరలో కనిపించాలనే చాదస్తాన్ని, మూర్ఖత్వంగా తీసి పారేయ లేకపోయింది సరిత. ఆధునిక భావాలుండటం అంటే, కేవలం వేషధారణలోనే కాదని, ఆచరణలో కూడా చూపిస్తే మంచిదని అనుకుంది. దుస్తులు కేవలం మనిషి హుందాతనాన్ని పెంచాలేతప్ప, నాగరికతను ప్రదర్శించే సాధనాలు కాకూడదనుకుంది.

విడిగా వుండటం వల్ల సరితకు, పని భారం పెరిగింది. పిల్లల్ని క్రెచ్‌లో చేర్పాల్సి వచ్చింది. ఉమ్మడి కుటుంబంలో వున్నప్పుడు ఖర్చులు మితంగా వుండడంతో, కొంత జీతంలో ఆదా చేసేది. పిల్లల పేరున ఆదా చేసేది. ఇప్పుడు ఏం ఆదా చేయలేకపోతోంది. పైగా అద్దె ఇల్లు. క్రెచ్‌లో పిల్లల్ని దించడం వల్ల వాళ్ళు తాత నాయనమ్మల ఆప్యాయతలకు, అనురాగానికి దూరమైనారు. తల్లిగా తాను వాళ్ళకు ప్రేమను పంచలేకపోయింది. ఆర్థికభారం పెరగడం, పిల్లల్ని 'క్రెచ్'లో వుంచడం వల్ల, ఎప్పుడూ అన్యమనస్కంగా వుంటుంది. దాంతో కాలేజీలో పిల్లలకు పాఠాలు కూడా సరిగ్గా చెప్పలేకపోయింది. ఈ అనుభవాల అవలోకనంతో ఒక నిర్ణయానికొచ్చిన సరిత ఎంతో రిలీఫ్‌గా ఫీలయింది. వెంటనే భర్తను పిలిచి, ''వ్యాన్ మాట్లాడుకొని రండి, సామాను సర్ది వుంచుతాను, మనం మీ ఇంటికి వెళ్దాం'' అన్న సరిత మాటల్ని రవి నమ్మలేకపోయాడు. తేరుకొని ''సాయంత్రం వ్యాను రెడీ, అప్పటికి సామాను సర్ది వుంచవోయ్'' అని బయటికి వెళ్ళాడు రవి. సామానుతో వున్న వ్యాన్ యింటి ముందు ఆగి, అందులోంచి కొడుకు, కోడలు దిగి లోపలికి రావటం చూసి ఆశ్చర్యపోయింది శాంతమ్మ.

నిండుగా చీర కట్టుకొని కాళ్లకు దణ్ణం పెడుతుంటే పొంగిపోయింది. ఇంటి ముందు ఆగిన వ్యాన్‌ని చూసి ''సామానంతా వచ్చేసినట్టేనా'' అనడిగిన అత్తగారికి తల అడ్డంగా వూపి ''ఊహు'' అంది సరిత.

అత్తగారి ముఖంలో ఒక్కసారిగా వచ్చిన మార్పు గమనించి-

''ఒక్క నైటీలు తప్ప'' అని ముసిముసిగా నవ్వింది.

కోడల్ని ఆప్యాయంగా అక్కున చేర్చుకుంది శాంతమ్మ.

★



## ఇష్టంలేని కాపురం

అమితాబ్ తన కష్టాలన్నీ వదిలించుకోవడానికి ఆఖరి ప్రయత్నం మొదలుపెట్టాడు. ఆయన తన కుమారుడు అభిషేక్‌ని హీరోగా తయారుచేస్తున్నాడు. అభిషేక్ సరసన హీరోయిన్‌గా కపూర్ వంశంలోని మరో అందాలసుందరి 'కరీనా'ను నటింపచేయాలనుకుంటున్నారు. కానీ కరీనాకు అభిషేక్ అంటే అంత ఇష్టం లేదు. ఆమె అక్క కరిష్మకపూర్‌కి మాత్రం అభిషేక్ అంటే అదొరకమైన క్రేజ్. కరీనాకు వినోద్‌ఖన్నా కొడుకు అక్షయ్‌ఖన్నా అంటే అమిత ఇష్టం. ఆమె ఎప్పుడో ఓ స్టేట్‌మెంట్ కూడా ఇచ్చింది. 'నేను హీరోయిన్‌ని అయితే నేనూ, అక్షయ్ ఓ మంచి జంటగా మారి సూపర్‌హిట్‌లు ఇస్తాం' అని! కరీనా మనసు అక్షయ్ మీద ఉందని తెలిసినా, అమితాబ్ ఆమెనే తన కొడుకు సరసన నటింపచేయాలనుకుంటున్నాడు. వినేవాళ్ళు మాత్రం ఇది 'ఇష్టంలేని పెళ్ళాంతో కాపురం' లా ఉంది అని గొణుక్కుంటున్నారు. నిజమే కదా?

-జె.వి.బాబు.